సాక్షి ఖమ్మం

మంగళవారం । 27 । ఫిబ్రవరి । 2024



ప్రభుత్వ భూమి హాంఫట్!

ఖమ్మం రూరల్ మండలంలో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురికాగా, ప్రభుత్వం విచారణకు రంగం సిద్ధం చేసింది. 8లో



తాకట్టు దిశగా వ్యవసాయం

కేంద్రం వ్యవసాయ రంగాన్ని విస్మరిస్తోందని ఆరోపిస్తూ కలెక్టరేట్ ఎదుట తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యాన ధర్నా చేశారు. 8లో

గరిష్టం / కనిష్టం
35° / 20°

వాతావరణం

జిల్లాలో సోమవారం ఉదయం, రాత్రి చలి ప్రభావం కనిపిస్తుంది. మధ్యాహ్నం మాత్రం ఉష్ణోగ్రత ఎక్కువగా నమోదవుతుంది.

న్యూస్‌రీల్

పోలీసు గ్రీవెన్స్‌కు 22 ఫిర్యాదులు



ఫిర్యాదులు పరిశీలిస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు పోలీసు కమిషరేట్‌లో నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డేలో సోమవారం 22 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా కమిషనర్ సునీల్‌దత్ ఫిర్యాదులు స్వీకరించి బాధితులతో మాట్లాడారు. వృద్ధాప్యంలో వారసులు పట్టించుకోవడం లేదనే కాక భూవివాదాలు, కుటుంబ, వ్యక్తిగత సమస్యలు, ఆర్థిక లావాదేవీలపై ఫిరఆయదులు ఉండగా ఆయన పరిశీలించారు. వీటిపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్‌హెచ్‌ఓలను సీపీ ఆదేశించారు.

రైల్వే అండర్ బ్రిడ్జి ప్రారంభం

వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ



ప్రారంభోత్సవంలో పాల్గొన్న వనజీవి రామయ్య, అధికారులు

ఖమ్మం మామిళ్లగూడెం: అమృత్ భారత్ పథకంలో భాగంగా జిల్లాలోని కామంచికల్ వద్ద నిర్మించిన రైల్వే అండర్‌బ్రిడ్జిని ప్రధాని నరేంద్ర మోదీ ఢిల్లీ నుంచి వర్చువల్‌గా సోమవారం ప్రారంభించారు. గతంలో ఇక్కడ రైల్వే గేట్ ఉండగా, రాకపోకలకు గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని అండర్ బ్రిడ్జి నిర్మించారు. ఢిల్లీ నుంచి మోదీ ఆన్‌లైన్‌లో ప్రారంభించగా.. ఇక్కడ ముఖ్య అతిథిగా పద్మశ్రీ వనజీవి రామయ్య పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. డీఎస్‌టీఈ ప్రతమేష్, సీసీఐ ఎం.డీ.జాఫర్, ఆర్పీఎఫ్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఐ అనూష, అధికారులు ద్రోణాచార్య, శ్రీనివాస్, మోహన్‌కుమార్, జనార్దన్, వెంకటకృష్ణ, నాగిరెడ్డితో పాటు బీజేపీ నాయకులు మంద సరస్వతి, డోకుపర్తి రవీందర్‌కుమార్, రవిరాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యాధికారులకు మరో వారం అవకాశం

ఖమ్మంవ్యవసాయం: గొర్రెల పథకం అక్రమాలపై జారీ చేసిన నోటీసులకు సమాధానం ఇచ్చేందుకు పశువైద్యాధికారులకు మరో వారం గడువు ఇచ్చారు. 2017–18 సంవత్సరంలో గొర్రెల పథకం అమలులో అక్రమాలు చోటు చేసుకున్నట్లు 'కాగ్' బయటపెట్టగా, 27 మంది పశువైద్యాధికారులు, ఐదుగురు సహాయ పశువైద్య సంచాలకులను బాధ్యులుగా చేరుస్తూ జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ బి.వేణుమనోహర్‌రావు నోటీసులు జారీ చేశారు. కాగ్ పేర్కొన్న అక్రమాలపై వారంలోగా సమాధానం ఇవ్వాలని, లేనిపక్షంలో వేతనం నుంచి రికవరీ చేస్తామని పేర్కొన్నారు. దీంతో పశువైద్యాధికారులు ఆ సమయాన జిల్లా పశుసంవర్ధక శాఖకు సమర్పించిన నివేదికలను గుర్తించడంలో నిమగ్నమయ్యారు. అడుగున పడిన నివేదికలను గుర్తించేందుకు మరికొంత సమయం కావాలని కోరగా సంజాయిషీ ఇచ్చేందుకు మరో వారం గడువు పొడిగించినట్లు జేడీ తెలిపారు.


ముత్తంగి అలంకరణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారు సోమవారం ముత్తంగి అలంకరణలో దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

కాంగ్రెస్‌లో గుస్సా!



కాంగ్రెస్ పార్టీలో ఖమ్మం కార్పొరేషన్ వేదికగా రాజకీయం వేడెక్కుతోంది. అధికారంలోకి వచ్చాక బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు వలస వస్తుండడంపై హస్తం పార్టీ నేతల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇటీవల నలుగురు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్ గూటికి చేరగా, సోషల్ మీడియా వేదికగా విమర్శలు వెల్లువెత్తాయి. నాడు బీఆర్‌ఎస్‌లో ఉండి తమను ఇబ్బంది పెట్టిన వారు ఇప్పుడు లబ్ధి కోసమే తమ పార్టీలో చేరారంటూ కాంగ్రెస్ కార్పొరేటర్లు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. మరోపక్క మిగిలిన కార్పొరేటర్లు ఎవరూ కాంగ్రెస్‌లోకి వెళ్లకుండా కట్టడి చేసే పనిలో బీఆర్‌ఎస్ పార్టీ నిమగ్నమైంది. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

బీఆర్‌ఎస్ కార్పొరేటర్ల చేరికపై అసంతృప్తి

- లబ్ధి కోసమే వచ్చారంటూ 'హస్తం' నేతల విమర్శలు
- సోషల్ మీడియా వేదికగా పలువురి అసహనం
- మరోవైపు కార్పొరేటర్ల కట్టడికి బీఆర్‌ఎస్ యత్నం

మేయర్ పీఠంపై గురితో..

ఖమ్మం నగర మేయర్ పీఠాన్ని దక్కించుకోవడంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ చేరికలను ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ మొత్తం 60 డివిజన్లు ఉండగా, చేరికల తర్వాత బీఆర్‌ఎస్‌కి 33 మంది, కాంగ్రెస్ పార్టీకి 22 మంది, సీపీఎం, సీపీఐలకు ఇద్దరేసి కార్పొరేటర్లతో పాటు బీజేపీకి ఒక కార్పొరేటర్ ఉన్నారు. ఈ ఏడాది మే నెలతో బీఆర్‌ఎస్ మేయర్ పీఠం చేపట్టి మూడేళ్లవుతుంది. ఆ తర్వాత అవిశ్వాసం పెట్టే వ్యూహంలో భాగంగానే బీఆర్‌ఎస్ కార్పొరేటర్లను చేర్చుకునేందుకు కాంగ్రెస్ నజర్ పెట్టింది. బలం పెంచుకున్న తర్వాత ఎలాగైనా అవిశ్వాసం పెడతారన్న ప్రచారంతో పలువురు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్ వైపు చూస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇందులో భాగంగానే ఇటీవల నలుగురు కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరారు.

అడ్డుకునేందుకు బీఆర్‌ఎస్

కాంగ్రెస్ పార్టీ మేయర్ పీఠంపై గురి పెట్టి చేరికలను ప్రోత్సహిస్తుందనే సమాచారంతో కార్పొరేటర్లను కాపాడుకునేందుకు బీఆర్‌ఎస్ నేతలు రంగంలోకి దిగారు. ఈ నేపథ్యాన ఆదివారం మేయర్ నివాసంలో పార్టీ ముఖ్య నేతలు, కార్పొరేటర్లతో సమావేశమయ్యారు. మేయర్‌తో పాటు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్ ఈ సమావేశానికి హాజరయ్యారు. 'పార్టీ నుంచి ఎవరూ కాంగ్రెస్‌లో చేరొద్దు, ఆ పార్టీలోకి పోవాల్సిన అవసరం లేదు.. ధైర్యంగా ఉండాలి' అని ఆయన వారికి చెప్పినట్లు తెలిసింది. అయితే ఈసమావేశానికి అందరు కార్పొరేటర్లు హాజరుకాకపోగా, పాల్గొన్న వారు సైతం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు కూడా తాము ఇబ్బంది పడ్డామని నేరుగానే చెప్పినట్లు సమాచారం. గైర్హాజరైన వారిలో కొందరు వ్యక్తిగత పనులను కారణంగా చెప్పగా, ఇంకొందరు పార్టీ తీరుపై అసంతృప్తితోనే హాజరుకాలేదనే ప్రచారం జరుగుతోంది. దీంతో ఇంకెందరు కాంగ్రెస్‌లోకి వెళ్తారోనన్న చర్చ సాగుతోంది.

కాంగ్రెస్ వ్యూహం ఎలా ఉన్నా.. ఈ చేరికలపై మాత్రం ఆ పార్టీలోని కార్పొరేటర్లు, నేతలు భగ్గుమంటున్నట్లు తెలిసింది. సదరు నలుగురు కార్పొరేటర్లను ఉద్దేశించి ఓ డివిజన్ కాంగ్రెస్ కార్పొరేటర్ తీవ్ర విమర్శలు చేస్తూ సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ చర్చనీయాంశంగా మారింది. అంతేకాకుండా మరో డివిజన్‌కు చెందిన నాయకుడు సైతం కార్పొరేటర్‌ను తమ ప్రమేయం లేకుండా ఎలా చేర్చుకున్నారంటూ ముఖ్య నేతలను ప్రశ్నించినట్లు తెలిసింది. ఈ పరిణామాలతో కాంగ్రెస్‌లో పాత నేతలు, ఇప్పుడు చేరుతున్న వారి నడుమ పలు డివిజన్లలో వార్ కొనసాగుతోంది.

కేబుల్ వంతెన నిర్మాణం షురూ..



మున్నేటిపై తీగల వంతెన నిర్మాణానికి చేపడుతున్న పనులు

మున్నేటిలో మొదలైన పనులు

ఖమ్మంఅర్బన్: జిల్లా కేంద్రంలోని మున్నేటిపై కేబుల్ వంతెన నిర్మాణపనులు ప్రారంభమయ్యాయి. హైదరాబాద్‌లోని దుర్గం చెరువు మాదిరి ఇక్కడ కేబుల్ వంతెన నిర్మాణానికి రూ.180 కోట్లు మంజూరు చేయగా, టెండర్ల ప్రక్రియ పూర్తయింది. దీంతో మున్నేరుపై కాల్వొడ్డు వద్ద ఉన్న పాత వంతెన సమీపాన కేబుల్ వంతెన నిర్మాణానికి కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు పనులు మొదలుపెట్టారు. ఏళ్ల క్రితం కాల్వొడ్డులో మున్నేరుపై నిర్మించిన వంతెన దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. ఏటా వర్షాకాలంలో మున్నేటికి వరద ముంచెత్తుతుండగా, ఎప్పుడేం జరుగుతుందో తెలియని పరిస్థితులు ఎదురవుతున్నాయి. దీంతో పాత బ్రిడ్జిని తొలగించి కొత్త వంతెన నిర్మించాలని తొలుత భావించారు. కానీ సాధారణ బ్రిడ్జికి తీగల వంతెన నిర్మించాలని ఆతర్వాత ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా తీగల వంతెన నిర్మిస్తే రవాణా సౌకర్యం మెరుగుపడడంతో పాటు పర్యాటక ప్రదేశంగానూ ఆకట్టుకోనుంది. వారం రోజులుగా మున్నేరులో పిల్లర్ల నిర్మాణానికి గుంతలు తీస్తుండగా, సామగ్రి తరలింపునకు తాత్కాలిక రహదారి నిర్మిస్తున్నారు. రానున్న మూడు నెలలు మున్నేటిలో నీటిమట్టం తగ్గనుండగా, చకచకా పనులు సాగుతాయని ఓ అధికారి తెలిపారు.

ఇంటర్ విద్యార్థుల కోసం ఆర్టీసీ బస్సులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఇంటర్‌మీడియట్ వార్షిక పరీక్షలు ఈనెల 28నుండి జరగనుండగా, విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేగా ఆర్టీసీ బస్సులు నడిపించనున్నట్లు ఖమ్మం రీజినల్ మేనేజర్ సీహెచ్.వెంకన్న తెలిపారు. ఉదయం 8గంటలకల్లా విద్యార్థులు కేంద్రాలకు చేరుకునేలా సర్వీసులు నడిపించాలని డీఎంలను ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఈమేరకు ఇంటర్ విద్యార్థులు బస్‌పాస్ రూట్‌తో సంబంధం లేకుండా హాల్‌టికెట్‌పై ఉన్న కేంద్రానికి ఉచితంగా ప్రయాణం చేయవచ్చని తెలిపారు. పాస్ కలిగిన విద్యార్థులు కాంబినేషన్ టికెట్ తీసుకుంటే ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ ప్రయాణించవచ్చని పేర్కొన్నారు. ఇక మహాలక్ష్మి పథకం ద్వారా విద్యార్థినులకు బస్‌పాస్ లేకున్నా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చని వెల్లడించారు. ఈమేరకు ఇబ్బందులు ఎదురైతే సంప్రదించాల్సిన నంబర్లను ఆర్‌ఎం విడుదల చేశారు. ఖమ్మం కొత్త బస్టాండ్ నంబర్ 99592 25979, పాత బస్టాండ్ 99592 25965, సత్తుపల్లి 99592 25990, మణుగూరు 89853 61796, కొత్తగూడెం 99592 25982, మధిర 73829 25289, భద్రాచలం 99592 25987, ఇల్లెందులో 99592 25984 నంబర్ల ద్వారా సంప్రదించాలని ఆర్‌ఎం సూచించారు.

పల్స్ పోలియోను విజయవంతం చేద్దాం

- వచ్చేనెల 3న పల్స్ పోలియో
- జిల్లాలో ఐదేళ్ల వయస్సు లోపు పిల్లలు 92,511 మంది
- వైద్య, ఆరోగ్య శాఖ సమీక్షలో కలెక్టర్ గౌతమ్



గ్రీవెన్స్ డేలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: వచ్చే నెల 3వ తేదీన నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా వైద్య, ఆరోగ్యశాఖతో పాటు అనుబంధ శాఖల అధికారులు కృషి చేయాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. ఈమేరకు పల్స్‌పోలియో ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో సోమవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఐదేళ్ల లోపు పిల్లలు 92,511 మంది ఉండగా, వీరికి పల్స్‌పోలియో చుక్కలు వేసేందుకు 4,984 మంది సిబ్బందిని కేటాయించామన్నారు. పీహెచ్‌సీలు, యూహెచ్‌సీల్లోనే కాక మొబైల్ పాయింట్లు ఏర్పాటుచేస్తున్నందున ఏ ఒక్కరూ తప్పకుండా చుక్కలు వేయాలని సూచించారు. ఈసమావేశంలో డీఎంహెచ్‌ఓ సుబ్బారావు, డీఆర్‌డీఓ సన్యాసయ్య, జెడ్పీ సీఈఓ వినోద్, డీఈఓ సోమశేఖరశర్మ, వివిధ శాఖల అధికారులు సైదులు, ప్రమీల, ప్రశాంత్, సత్యనారాయణ, సురేందర్, జ్యోతి, రాంగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

పదో తరగతి, ఇంటర్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. విద్యాశాఖ, ఇతర అనుబంధ శాఖల అధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ ఈనెల 28నుంచి ఇంటర్, మార్చి 18 నుండి పదో తరగతి పరీక్షలు జరగనున్నందున ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతీ కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా చూడాలని తెలిపారు. అలాగే, రూట్లలో బస్సులు నడిపించాలని కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. డీఐఈఓ కె.రవిబాబు, డీఈఓ సోమశేఖరశర్మతోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించండి

గ్రీవెన్స్ డేలో ప్రజలు ఇచ్చే ప్రతీ ఫిర్యాదును పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. గ్రీవెన్స్ డేలో భాగంగా కలెక్టరేట్‌లో సోమవారం ఆయన ఫిర్యాదులు స్వీకరించగా, అధికారులకు సూచనలు చేశారు. ఈమేరకు కల్లూరు మండలానికి చెందిన తుమ్మల గంగాధర రావు, తుమ్మల ఝాన్సీకుమారి, కొణిజర్లకు చెందిన పి.గోవిందరావు తమ భూములు నిషేధిత జాబితాలో నమోదయ్యాయని చెప్పగా అక్కడికక్కడే పరిష్కారం చూపారు. అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ మాయంక్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

ఆర్‌బీఐ ఆధ్వర్యాన ఈనెల 26నుంచి మార్చి 2వరకు నిర్వహించనున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు.ఈ మేరకు ఆయన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, ఏసీపీ సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు వేళాయె..

- రేపటి నుంచి వార్షిక పరీక్షలు
- జిల్లాలో 36,578మంది విద్యార్థులు
- 70 కేంద్రాల్లో పూర్తయిన ఏర్పాట్లు
- గంట ముందు నుంచే అనుమతి.. నిమిషం నిబంధన అమలు



ఖమ్మంసహకారనగర్: విద్యార్థి దశలో కీలకమైన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి మొదలుకానున్నాయి. వచ్చేనెల 19వ తేదీ వరకు జరిగే పరీక్షల నిర్వహణకు జిల్లాలో 70కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు కలిపి 36,578మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందులో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 18,481మంది, ద్వితీయ సంవత్సరం వారు 18,097మంది ఉన్నారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు జరగనుండగా, ఉదయం 8గంటల నుంచే విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతిస్తారు. అలాగే, నిర్ణీత సమయానికి మించి నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని అధికారులు స్పష్టం చేశారు.

పకడ్బందీగా నిర్వహించేలా...

జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇందుకోసం హైపవర్ కమిటీ(హెచ్‌సీపీ), జిల్లా ఎగ్జామినేషన్ కమిటీ(డీఈసీ)లే కాక మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 10మందితో సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించారు. ఇక ఒక్కో కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్, అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, ఏడుగురు కస్టోడియన్ అధికారులను సైతం నియమించినట్లు అధికారులు వెల్లడించారు. విద్యార్థులు కేంద్రాలకు చేరుకోవడంలో కానీ పరీక్ష రాయడంలో కానీ ఎలాంటి ఇబ్బంది పడకుండా ఏర్పాట్లుచేయాలని కలెక్టర్ గౌతమ్ ఇప్పటికే వివిధ శాఖల అధికారులకు సూచనలు చేశారు.

పోలీసుస్టేషన్లలో ప్రశ్నాపత్రాలు

ఇప్పటికే ఇంటర్‌మీడియట్ వార్షిక పరీక్ష ప్రశ్నపత్రాలు జిల్లాకు చేరాయి. వీటిని కేంద్రాలకు సమీపంలోని పోలీసుస్టేషన్లలో భద్రపరిచారు. పరీక్ష జరిగే రోజు బందోబస్తు నడుమ అధికారులు కేంద్రానికి తీసుకెళ్లనున్నారు. కాగా, పరీక్షా కేంద్రాలను ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలతో పాటు మోడల్ స్కూళ్లలోనే కాక నాలుగు ప్రభుత్వ హైస్కూళ్లు, రెండు ఇంజనీరింగ్ కళాశాలల్లో ఏర్పాటు చేశారు.

యాప్‌లో కేంద్రం, రూట్‌మ్యాప్

ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణలో ఈసారి సాంకేతికత పరిజ్ఞానాన్ని ప్రవేశపెట్టారు. విద్యార్థులు టీఎస్‌బీఐఈ tsbie m services యాప్‌ను ఆండ్రాయిడ్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని ఫోన్ నంబర్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆపై సిటిజన్ అనే ఆప్షన్ వద్ద హాల్‌టికెట్ నంబర్ నమోదు చేస్తే పరీక్షా కేంద్రం వివరాలు, మ్యాప్‌ను చూపిస్తుంది. తద్వారా పరీక్షా కేంద్రాన్ని సులువుగా గుర్తించడమే కాక చేరుకునే వెసలుబాటు లభిస్తుంది.

వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు తీసుకోవచ్చు



ప్రైవేట్ కళాశాలల బాధ్యులు హాల్‌టికెట్ ఇవ్వకపోతే tsbie (telangana state borad of intermediate education) వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షకు హాజరుకావొచ్చు. జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేశాం. నిమిషం నిబంధన అమల్లో ఉన్నందున విద్యార్థులు ముందురోజే పరీక్ష కేంద్రాలను సరిచూసుకుని సమయానికి హాజరుకావాలి.

– కె.రవిబాబు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి

ఖమ్మం–ఇల్లెందు రోడ్డుకు రూ.35కోట్లు

- 8 కి.మీ. మేర విస్తరణకు గ్రీన్ సిగ్నల్
- మధిర, పాలేరు నియోజకవర్గాల్లో పనులకూ నిధులు



ఖమ్మం - ఇల్లెందు మార్గంలో రఘునాథపాలెం వద్ద ఏడాది క్రితం విస్తరించిన రహదారి

ఖమ్మంఅర్బన్: జిల్లాలోని ప్రధాన రహదారుల విస్తరణ, నిర్మాణానికి రాష్ట్రప్రభుత్వం భారీగా నిధుల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. ఇందులో ప్రధానంగా ఖమ్మం - ఇల్లెందు మార్గంలోని సుమారు 8 కి.మీ. రోడ్డు విస్తరణకు రూ.35 కోట్లు మంజూరు చేస్తూ రెండు, మూడు రోజుల్లో జీఓ విడుదల కానున్నట్లు సమాచారం. అంతేకాక మధిర, పాలేరు నియోజకవర్గాల్లో సైతం పలు రోడ్ల నిర్మాణానికి గతంలో ఆర్‌అండ్‌బీ అధికారులు ఇచ్చిన ప్రతిపాదనల ఆధారంగా నిధులు మంజూరు చేసినట్లు తెలిసింది. నిత్యం రద్దీతో ఉండడమే పాటు ఖమ్మం, భద్రాద్రి జిల్లాలకు వారధిగా ఉన్న ఖమ్మం - ఇల్లెందు ప్రధాన రోడ్డు విస్తరణకు నిధులను ప్రభుత్వం కేటాయించినట్లు సమాచారం. ఈ రహదారిపై ఏడాది క్రితమే కోయచలక క్రాస్ నుండి రఘునాథపాలెంలోని రైతు వేదిక వరకు నాలుగు లేన్లుగా విస్తరించారు. ఇక రఘునాథపాలెం నుండి పండితాపురం వరకు మిగిలిన 8 కి.మీ. మేర రహదారి విస్తరణకు సైతం నిధులు మంజూరైనట్లు తెలిసింది. దీంతో ఖమ్మం - ఇల్లెందు నడుమ నాలుగు లేన్ల రహదారి అందుబాటులోకి వచ్చి ప్రయాణం సాఫీగా సాగనుంది.

లేఖ ఇవ్వండి.. సీబీఐ దర్యాప్తు చేయిస్తాం

- మోదీ మూడోసారి పీఎం కావడం ఖాయం
- బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి
- జిల్లాలో కొనసాగిన బీజేపీ సంకల్ప యాత్ర



సత్తుపల్లిలో మాట్లాడుతున్న బీజేపీ శాసనసభా పక్షనేత మహేశ్వర్‌రెడ్డి

సత్తుపల్లి/వైరా/కల్లూరు: ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బీఆర్‌ఎస్ ప్రభుత్వ అవినీతిపై ఆధారాలు ఉన్నాయని చెప్పినందున, సీబీఐకి లేఖ ఇస్తే తాము దర్యాప్తు జరిపిస్తామని బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సూచించారు. బీజేపీ ఆధ్వర్యాన చేపట్టిన సంకల్ప యాత్ర సోమవారం జిల్లాలోని సత్తుపల్లి, కల్లూరు, వైరాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభల్లో మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ చెప్పిన ఆరు గ్యారంటీలకు రూ.3.50 లక్షల కోట్లు అవసరమవుతాయని, కానీ ఈ బడ్జెట్‌లో కేవలం రూ.53వేల కోట్లే కేటాయించారని విమర్శించారు. ఒక్కో గ్యారంటీల్లో నాలుగేసి పథకాలు ఉండగా, రెండు అమలుచేసి అన్నీ అమలు చేశామని అబద్ధ ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. కాగా, నిరుద్యోగ భృతి రూ.4వేలు ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించి ప్రియాంకగాంధీతో చెప్పించిన విషయంపై అసెంబ్లీలో నిలదీస్తే డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అలాంటి హామీ ఇవ్వలేదని మాట తప్పారని మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ఇక ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ఉన్నా కృష్ణాజలాల సాధనలో 299 టీఎంసీలకే ఒప్పుకున్నారని ఆయన తెలిపారు. కాగా, గత పదేళ్లు రాష్ట్రంలో అరాచక, అవినీతి, కుంభకోణాల, రాచరిక పాలన జరిగిందని, రాష్ట్రాన్ని దోచుకుని, రూ.లక్ష కోట్లు అప్పులు చేశారని మహేశ్వర్‌రెడ్డి మండిపడ్డారు. ఖమ్మం జిల్లా ప్రజలు కాంగ్రెస్, బీఆర్‌ఎస్, కమ్యూనిస్టు పార్టీలను చూసిన నేపథ్యాన ఈసారి బీజేపీకి అవకాశం ఇస్తే అందరికీ న్యాయం జరుగుతుందని మహేశ్వర్‌రెడ్డి తెలిపారు.

మళ్లీ మోదీనే ప్రధాని

నరేంద్రమోదీ మూడోసారి కూడా ప్రధాని కావడం ఖాయమని మహేశ్వర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అవినీతికి తావు లేకుండా పరిపాలన సాగిస్తున్న బీజేపీని మరోమారు గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కాగా, బీజేపీ యాత్రకు పలుచోట్ల ఎమ్మార్పీఎస్ నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఈ యాత్రలో బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, నాయకులు నంబూరి రామలింగేశ్వరరావు, రంగా కిరణ్, ఈవీ.రమేష్, తాండ్ర వినోద్‌రావు, దేవకి వాసుదేవరావు, బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, గోంగూర వెంకటేశ్వర్లు, వీరంరాజు భాస్కర్జి, మున్నా మిశ్రా, పాలకొల్లు శ్రీను, రహ్మతుల్లా, శ్యామ్ సుందర్‌నాయక్, ఆచంటి నాగస్వామి, మట్టా ప్రసాద్, నెల్లూరి కోటేశ్వరరావు, శ్యాంరాథోడ్, నున్నా రవికుమార్, పీవీ.రమేష్, గోంగూర వెంకటేశ్వర్లు, బండారు నరేష్, ఏలే భద్రయ్య, అంకిరెడ్డి సుధీర్‌రెడ్డి, గుమ్మా రామకృష్ణ, గుండపనేని అనీల్, తుమ్మలపూడి పుల్లారావు, పానుగంటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి హాంఫట్

- ఖమ్మం రూరల్ మండలంలో ఆక్రమణల పర్వం
- నామరూపాలు లేకుండా పోయిన సాగర్ కాల్వ
- రూ.40 కోట్ల విలువైన కాల్వ భూములు ఖతం
- ఆక్రమణలపై ప్రభుత్వం కన్నెర్రతో అక్రమార్కుల్లో ఆందోళన


ఆటోనగర్‌లో పంట కాల్వ వద్ద పైప్‌లు వేసి వెంచర్‌కు ఏర్పాటుచేసిన దారి

ఖమ్మంరూరల్: ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న వారిని వదిలిలేది ప్రభుత్వం తాజాగా హెచ్చరించడంతో భూఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ప్రధానంగా ఖమ్మం నగరానికి కూతవేటు దూరంలో ఉన్న ఖమ్మం రూరల్ మండలంలో ఐదారేళ్ల కాలంలో కొందరుఅక్రమార్కులు ప్రభుత్వ భూమితో పాటు ప్రైవేట్ భూములను కాజేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అప్పటి ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడంతో వారి అక్రమాలు యథేచ్ఛగా కొనసాగాయని చెబుతున్నారు. అయితే, అక్రమార్కులనే కాక వారికి అండగా నిలిచిన అధికారులనూ వదిలిపెట్టబోమని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించడం ఆక్రమణదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోందని సమాచారం. ఖమ్మం రూరల్ మండలంలోని ఎన్‌ఎస్‌పీ కాల్వ భూములు, మున్నేటి పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని బఫర్ జోన్‌లో వెంచర్లు చేయగా.. ప్రభుత్వం విచారణ జరిపితే తమ పరిస్థితి ఏమిటని అప్పట్లో ఇక్కడ పనిచేసిన రెవెన్యూ అధికారులు మధనపడుతున్నట్లు తెలిసింది.

రియల్టర్లు, నేతలు, అధికారులదే హవా.

ప్రభుత్వ భూముల ఆక్రమణల పర్వానికి గత అధికార పార్టీ నాయకుల అండదండలు ఉండడంతో కొందరు రియల్టర్లు, నాయకులు అధికారులను మచ్చిక చేసుకొని పని కానిచ్చేశారు. ఖమ్మం రూరల్ మండలంలోని మంగళగూడెంలో ఎకరాల కొద్దీ ప్రభుత్వ భూమిని ఆక్రమించుకోవడానికి అప్పటి రెవెన్యూ అధికారుల అండదండలు ఉన్నట్లు ప్రచారం జరిగింది. అదే గ్రామానికి చెందిన ఓ ప్రజాప్రతినిధికి దోచిపెట్టడానికి ఓ మహిళా అధికారి సహకరించినట్లు ఆరోపణలు వచ్చాయి. అయినా అధికారం చేతుల్లో ఉండటం, నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధి అండదండలు ఉండటంతో వారు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్లు సాగింది.

ఇంకొన్నిచోట్ల...

గుదిమళ్ల పరిధిలోని మున్నేటి పక్కన కొందరు రియల్టర్లు ప్రభుత్వ భూమిని కొంత మేర ఆక్రమించుకొని వెంచర్ వేయడంపై అప్పట్లో దుమారం రేగింది. ఇక పెదతండా, ఏదులాపురం, ఆటోనగర్, ముత్తగూడెం ఏరియాల్లోనూ రియల్టర్లు సాగర్ కాల్వను సైతం ఆక్రమించుకుని నామరూపాల్లేకుండా చేశారు. 33అడుగులు ఉండాల్సిన పంట కాల్వ ఇప్పుడు అసలే కనిపించడం లేదు. ఏదులాపురంలోని ఆటోనగర్‌లో ఓ వెంచర్ నిర్వాహకుడు 33 అడుగుల కాల్వను ఆక్రమించి రెండు సిమెంట్ పైపులు వేసి దారి ఏర్పాటుచేసుకున్నాడు. దీంతో పొలాలకు సాగునీరు అందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఎన్నెస్పీ పిల్ల కాల్వల నుండి పొలాలకు సాగునీటిని మళ్లించేందుకు 40 ఏళ్ల క్రితం ఏదులాపురం చెరువు నుండి పెదతండా గుర్రాలపాడు వరకు 33అడుగుల కాల్వ తవ్వారు. కానీ ఖమ్మం రూరల్ మండలంలోని, పెదతండా, ఏదులాపురం, గొల్లగూడెం, ముత్తగూడెం, వరంగల్ క్రాస్‌రోడ్ ప్రాంతాల్లో ఆక్రమణల కారణంగా కాల్వ అక్రమార్కుల చెరల్లో చిక్కింది. ఆక్రమించుకున్న సాగర్ కాల్వ భూమి విలువ బహిరంగ మార్కెట్‌లో రూ. 40కోట్ల పైమాటే ఉంటుందని అంచనా.

భూఆక్రమణలపై మంత్రి సీరియస్

ఇదిలా ఉండగా ఆక్రమణలపై నూతన ప్రభుత్వం విచారణ చేయిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వ భూమి ఆక్రమణ, భూదందా, మట్టి, మైనింగ్, ఇసుక మాఫియాపై రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇటీవల స్పందించారు. గత నెలలో ఉన్నత స్థాయి సమీక్షలో ఆయన ఆక్రమణదారులపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించడంతో అక్రమార్కులు హడలిపోతున్నారు. అయితే, ఈ విషయంలో ఇంకా అధికారుల్లో కదలిక రాకపోవడంతో విమర్శలకు తావిస్తోంది. గతంలో అక్రమాలకు వంతపాడిన అధికారులు ఇప్పుడు ఇతర ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తుండగా, మంత్రి హెచ్చరికతో వణికిపోతున్నట్లు సమాచారం.

ఆక్రమణలపై దృష్టి సారిస్తాం..



నేను ఇటీవలే ఇక్కడ బాధ్యతలు స్వీకరించాను. అన్ని విషయాలపై సమగ్రంగా పరిశీలిస్తున్నా. ప్రధానంగా ప్రభుత్వ భూముల ఆక్రమణలపై దృష్టి సారించి తిరిగి స్వాధీనం చేసుకుంటాం. ఇందుకు కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– పి.రాంప్రసాద్, తహసీల్దార్, ఖమ్మం రూరల్

క్లుప్తంగా

జిల్లా సీనియర్స్ కబడ్డీ జట్టు ఎంపిక


పురుషుల కబడ్డీ జట్టు ఇదే..

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో సోమవారం జిల్లాస్థాయి సీనియర్స్ పురుషుల కబడ్డీ జట్టు ఎంపికకు పోటీలు నిర్వహించారు. ఈమేరకు 79మంది క్రీడాకారులు హాజరుకాగా నల్లగొండ జిల్లాలో మార్చి 2 నుంచి జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.క్రిస్టోఫర్‌బాబుతో పాటు సీహెచ్.సుధాకర్, గోపాల్, లాలయ్య, శేఖర్, శోభన్, కృష్ణ, నరేష్ వెల్లడించారు. కాగా, జట్టుకు ఎంపికైన వారిలో ఆజాద్, రమేష్, అఖిల్, యశ్వంత్‌కుమార్, వినోద్‌కుమార్, అనిల్, రామకృష్ణ, అనిల్‌కుమార్, సాయికుమార్, నవీన్, వినయ్, రాజ్‌కుమార్, శివనాగరాజు, ప్రవీణ్‌కుమార్, నవీన్, వినయ్, రాజు, ఉపేంద్రకుమార్, గోపి, అశోక్, సంపత్, నాగరాజు ఉన్నారు.

చేగొమ్మ సొసైటీ చైర్మన్ పదవికి శేఖర్ రాజీనామా

వైస్ చైర్మన్ శ్రీనివాసరావుకు బాధ్యతల అప్పగింత

కూసుమంచి: కూసమంచి మండలం చేగొమ్మ పీఏసీఎస్ చైర్మన్ పదవితో పాటు డీసీసీబీ డైరెక్టర్ పదవులకు ఇంటూరి శేఖర్ రాజీనామా చేశారు. ఆయన తన రాజీనామా పత్రాన్ని డీసీఓ మురళీధర్‌రావుకు సోమవారం పంపించగా ఆమోదించడమే కాక వైస్ చైర్మన్ బడేటి శ్రీనివాసరావుకు బాధ్యతలు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, చైర్మన్‌గా ఉన్న శేఖర్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ 13 మంది డైరెక్టర్లలో ఎనిమిది మంది ఈనెల 15న డీసీఓకు నోటీసు ఇచ్చారు. దీంతో మార్చి 2న సమావేశ నిర్వహణకు అధికారులు నిర్ణయించిన నేపథ్యాన ఆయన రాజీనామా చేయడం గమనార్హం. కాగా, జీళ్లచెరువులోని శ్రీ సీతా రామచంద్రస్వామి ఆలయ భూముల్లో అక్రమ మట్టి తవ్వకాల కేసులో శేఖర్‌ను ఈనెల 8న పోలీసులు అరెస్ట్ చేయగా ప్రస్తుతం జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్నారు.

బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల నూతన కార్యవర్గం


వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు


రాంబాబు, కార్యదర్శి

ఖమ్మంమయూరిసెంటర్: బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల జిల్లా కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఖమ్మంలో సోమవారం జరిగిన సమావేశంలో ఈ కమిటీ ఎన్నికైంది. అధ్యక్షుడిగా పొన్నెకంటి వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా కేలోతు రాంబాబును ఏకగ్రీవంగా ఎన్నుకోగా, బీఎస్ఎన్ఎల్ డీజీఎం దుంపల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సహాయ కార్యదర్శులు

ఖమ్మంవ్యవసాయం: ఇటీవల పదోన్నతి పొందిన వ్యవసాయ మార్కెట్ల సహాయ కార్యదర్శులు సోమవారం నూతన స్థానాల్లో బాధ్యతలు స్వీకరించారు. మద్దులపల్లి మార్కెట్ సూపర్‌వైజర్ పి.వీరాంజనేయులు సహాయ కార్యదర్శిగా పదోన్నతి కల్పించగా, ఖమ్మం మార్కెట్‌లో, ఖమ్మం మార్కెట్‌లో పనిచేస్తూ పదోన్నతి పొందిన వి.వెంకటేశ్వర్లు వైరా మార్కెట్‌లో బాధ్యతలు చేపట్టారు.

అలరించిన 'నీ గానమే.. నా ప్రాణం'

ఖమ్మంగాంధీచౌక్: అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి ఆధ్వర్యాన సోమవారం ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన 'నీ గానమే నా ప్రాణం' కార్యక్రమం అలరించింది. కార్యక్రమాన్ని కాషాయ ధ్వజారోహణంతో ప్రారంభించగా, గోపూజ, అఖండ జ్యోతి ప్రజ్వలన నిర్వహించారు. ఉదయం 6 గంటలకు మొదలైన కార్యక్రమం సాయంత్రం 6గంటల వరకు కొనసాగింది. ముగింపు సందర్భంగా సాయంత్రం పడిపూజ, ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడమే కాక పలువురిని సన్మానించారు. తెలంగాణ రాష్ట్ర అన్న వితరణ కమిటీ చైర్మన్ తాండ్ర రాంప్రసాద్, అఖిల భాతర అయ్యప్ప ప్రచార దీక్ష ప్రచార దీక్ష జిల్లా అధ్యక్షులు అల్లిక రామకృష్ణ, కార్యదర్శి కట్ట నరసింహారావు, నాగసాయి పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	8,300	7,700
కందులు	9,800	5,500
మినుములు	8,100	8,100
మిర్చి	21,650	14,000
మిర్చి తాలు	12,000	7,000
పత్తి	7,100	5,600

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.12,595

తాకట్టు దిశగా వ్యవసాయ రంగం

కలెక్టరేట్ ఎదుట ధర్నాలో రైతు సంఘాల నాయకులు


కలెక్టరేట్ ఎదుట ఆందోళనలో పాల్గొన్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: పారిశ్రామికవేత్తలకు మేలు జరిగేలా వ్యవహరిస్తున్న ప్రధాని మోదీ వ్యవసాయ విస్మరించడంతో పాటు తాకట్టు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు భాగం హేమంతరావు ఆరోపించారు. ఈ క్రమంలోనే రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం, సీపీఐ పిలుపు మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద చేపట్టిన ఆందోళనలో హేమంతరావు మాట్లాడుతూ రైతాంగంపై మోడీ సర్కార్ పగబట్టినట్లు వ్యవహరిస్తుందని ఆరోపించారు. మూడేళ్లుగా జరుగుతున్న ఆందోళనల్లో రైతులు నేలకొరుగుతున్న కనీస సానుభూతిలేని చందంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రతీ పంటకు మద్దతు ధర ప్రకటించడమే కాక స్వామినాథన్ సిఫారసులు అమలు చేసేలా వరకు తమ ఆందోళనలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు మహ్మద్ మౌలానా, కొండపర్తి గోవిందరావు, శింగు నర్సింహారావు, యర్రా బాబు, జానీమియా, అజ్మీరా రామ్మూర్తి, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, సీహెచ్.సీతామహాలక్ష్మి, మిడికంటి చిన్నవెంకటరెడ్డి, రావి శివరామకృష్ణ, మేకల శ్రీనివాసరావు, జాగర్లమూడి రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భారజల కర్మాగారానికి స్పెషల్ అచీవ్‌మెంట్ అవార్డు


అణుశక్తి విభాగం కార్యదర్శి మొహంతిని సన్మానిస్తున్న జీఎం, తదితరులు

అశ్వాపురం: అశ్వాపురంలోని మణుగూరు భారజల కర్మాగారానికి 2022–23 ఏడాదికి గాను స్పెషల్ అచీవ్‌మెంట్ అవార్డు లభించింది. ముంబైలో సోమవారం జరిగిన కార్యక్రమంలో భారత అణుశక్తి విభాగం కార్యదర్శి, అణుశక్తి కమిషన్ చైర్మన్ అజిత్ కుమార్ మొహంతి చేతుల మీదుగా స్పెషల్ అవార్డును భారజల కర్మాగారం జీఎం జగ్గారావు, ఉద్యోగ సంఘం అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, అణుశక్తి కార్మిక సమాఖ్య జాతీయ అధ్యక్షుడు గడ్డం రమేష్ అందుకున్నారు. అనంతరం చైర్మన్‌ను వారు సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం జగ్గారావు 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడుతూ అవార్డు రావడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ స్ఫూర్తితో అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పని చేస్తూ మణుగూరు భారజల కర్మాగారాన్ని అగ్ర స్థానంలో కొనసాగించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. అలాగే, శ్రీనివాసరావు, రమేష్ మాట్లాడుతూ కర్మాగారానికి అవార్డు రావడంలో కృషి చేసిన అధికారులు, ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు.

మెడికల్ ఏజెన్సీల్లో తనిఖీలు


మందుల నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లా కేంద్రంలోని పలు మెడికల్ ఏజెన్సీల్లో అధికారులు సోమవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆరు ఏజెన్సీల్లో తనిఖీ చేసిన అధికారులు మందు నాణ్యత, బిల్లులు, స్టాక్ రిజిష్టర్లను నిశితంగా పరిశీలించారు. తనిఖీల్లో ఔషధ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్, ఖమ్మం అర్బన్, భద్రాద్రి కొత్తగూడెం డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు అనిల్‌కుమార్, సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా పామాయిల్ గెలల రవాణా


అధికారులు పట్టుకున్న ట్రాక్టర్

దమ్మపేట: తెలంగాణ ఆయిల్‌ఫెడ్ పరిధిలోని రైతుల పామాయిల్ గెలలను నిబంధనలకు విరుద్ధంగా, సమీప ఆంధ్ర ప్రాంతంలోని ఓ ప్రైవేట్ ఫ్యాక్టరీకి తరలిస్తున్న ట్రాక్టర్లను సోమవారం ఆయిల్ ఫెడ్ సిబ్బంది అడ్డుకున్నారు. తిరిగి అశ్వారావుపేట ఫ్యాక్టరీకి పంపారు. సత్తుపల్లి మండలంలోని మేడిశెట్టివారిపాలెం, దమ్మపేట మండలంలోని అల్లిపల్లి, ముష్టిబండ, మందలపల్లి గ్రామాల్లో నాలుగు ట్రాక్టర్లను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ మేనేజర్ కల్యాణ్ మాట్లాడుతూ గెలలను ఏపీకి తరలిస్తే రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు.

రీడింగ్ కార్మికులకు కనీస వేతనం అమలుచేయాలి


సీఎండీకి వినతిపత్రం ఇస్తున్న యూనియన్ ప్రతినిధులు

ఖమ్మంవ్యవసాయం: విదుత్ సంస్థలో 22ఏళ్లుగా పనిచేస్తున్న తమకు కనీస వేతనం అమలుచేయాలని మీటర్ రీడర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు దోమకొండ సునీల్‌కుమార్, గుమ్మడి వెంకటేశ్వర్లు కోరారు. ఈ సందర్భంగా వారు సోమవారం హనుమకొండలో ఎన్పీడీసీఎల్ సీఎండీ కె.వరుణ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. నెలలో 15 రోజులు సంస్థకు పనిచేస్తున్న తమకు వంద శాతం బిల్లింగ్ బాధ్యతలు అప్పగించి కనీస వేతనం చెల్లించాలని కోరారు. సీఎండీని కలిసిన వారిలో వేమూరి వీరయ్య, బూరాల చిరంజీవరావు, వెలిసే రాజా, ఎలుకటి ప్రకాష్, ఇమ్మడి విజయ్‌కుమార్, సీహెచ్. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏఐసీబీఈఎఫ్ కార్యదర్శి నాగేందర్‌కు సన్మానం

ఖమ్మంవ్యవసాయం: ఆలిండియా కో–ఆపరేటివ్ బ్యాంకు ఎంప్లాయీస్ ఫెడరేషన్ కార్యదర్శిగా ఎన్నికైన పాశం నాగేందర్‌ను సోమవారం ఖమ్మం డీసీసీబీ కార్యాలయంలో పలువురు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సీఈఓ అబ్దుల్ ఉర్ రెహమాన్, తెలంగాణ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ చైర్మన్ కనకం జనార్దన్‌తో పాటు బోజడ్ల ప్రసాద్, అంజన్‌రావు, డీవీఎస్.రెడ్డి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.


నాగేందర్‌ను సన్మానిస్తున్న అధికారులు, సంఘం ప్రతినిధులు

తమ్మినేనికి పరామర్శ

ఖమ్మంరూరల్: సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను ఏపీకి చెందిన సీపీఎం నాయకుడు కందాడ మురళి తదితరులు సోమవారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన తమ్మినేని ప్రస్తుతం స్వగ్రామమైన ఖమ్మం రూరల్ మండలం తెల్దారుపల్లిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఏపీ నాయకులు ఆయనను పరామర్శించారు.

విద్యార్థులకు మోకాళ్ల కుర్చీ శిక్ష

భోజన సమయంలో స్టేజీ ఎక్కారని ఉపాధ్యాయుడి ఆగ్రహం


మోకాళ్లపై కూర్చున్న విద్యార్థులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 3వ డివిజన్ బల్లేపల్లి పాఠశాలలో సోమవారం మధ్యాహ్న భోజన సమయాన ఇద్దరు విద్యార్థులు స్టేజీ ఎక్కారంటూ ఓ ఉపాధ్యాయుడు వారిని మోకాళ్లపై కూర్చోబెట్టాడు. ఈ మేరకు ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో విద్యార్థి సంఘాల నాయకులు డీఈఓకు ఫిర్యాదు చేశారు. బల్లేపల్లిలో ప్రాథమిక, ఉన్నత పాఠశాల కలిసే ఉంటాయి. సోమవారం మధ్యాహ్న భోజనం తర్వాత ఇద్దరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఉన్నత పాఠశాలకు చెందిన స్టేజీ ఎక్కినట్లు సమాచారం. దీంతో ఉన్నత పాఠశాలలో పాఠాలు బోధిస్తున్న ఓ ఉపాధ్యాయుడు వారిద్దరిని స్టాఫ్ రూమ్‌కు పంపించి మోకాళ్లపై కూర్చోబెట్టినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై ఎంఈఓ ఎం.శ్రీనివాస్‌ను వివరణ కోరగా విచారణ చేస్తున్నామని తెలిపారు. అలాగే, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రమేష్‌తో మాట్లాడగా మధ్యాహ్న భోజనం చేయకుండా స్టేజీ ఎందుకు ఎక్కారని ఓ ఉపాధ్యాయుడు అడిగాడని.. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కావాలనే ఇలా ఫొటో తీయించినట్లుగా అనుమానం ఉందని చెప్పారు.

అదుపుతప్పి చెట్టును ఢీకొన్న లారీ

డ్రైవర్ మృతి, క్లీనర్ పరిస్థితి విషమం

దమ్మపేట: అతివేగంతో ప్రయాణిస్తున్న లారీ అదుపుతప్పి చెట్టును ఢీకొని డ్రైవర్ మృతి చెందాడు. క్లీనర్ పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదం మండలంలోని గట్టుగూడెం గ్రామంలో రాష్ట్రీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పాత ఇనుము లోడు లారీ వైజాగ్ నుంచి సత్తుపల్లి వైపు వెళ్తోంది. ఈ క్రమంలో గట్టుగూడెం గ్రామ సమీపంలోని పల్లం రోడ్డులో ఒక్కసారిగా అదుపుతప్పి ఢీకొని బోల్తా కొట్టింది. దొర్లుకుంటూ వెళ్లి చెట్టును ఢీకొట్టింది. చెట్టు కేబిన్‌లో ఇరుక్కుపోగా లారీ డ్రైవర్ ఎండీ అర్బాజ్(25) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. క్లీనర్ ఎండీ జునాయిద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతికష్టం మీద క్లీనర్‌ను బయటకు తీసి, అంబులెన్స్‌లో అశ్వారావుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి ఖమ్మం ఆస్పత్రికి తీసుకెళ్లారు. మద్యం తాగి వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సాయికిషోర్ రెడ్డి హెచ్చరించారు.

సీటీసీ అడిషనల్ డీసీపీగా గణేష్

ఖమ్మంక్రైం: ఖమ్మం స్పెషల్ బ్రాంచ్ ఏసీపీగా విధులు నిర్వర్తిస్తున్న పీ.వీ.గణేష్‌కు అడిషనల్ ఎస్పీగా పదోన్నతి లభించింది. ఈమేరకు ఆయనను ఖమ్మం సీటీసీ అడిషనల్ డీసీపీగా నియమిస్తూ డీజీపీ రవిగుప్తా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గణేష్ ఉమ్మడి జిల్లాలోని పలుచోట్ల ఎస్ఐ, సీఐ, డీఎస్పీగా పనిచేశారు.

మహిళ ఆత్మహత్య

ములకలపల్లి : తరచూ పిల్లలుపుట్టి చనిపోతుండంతో మనస్తాపం చెంది ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మండల పరిధిలోని గుత్తి కోయగుంపులో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మామిళ్లగూడెం శివారులో నివసించే వలస ఆదివాసీలు అడమ, లక్మలకు ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలు పుట్టి చనిపోయారు. ఈక్రమంలో కొంతకాలంగా మనస్తాపంతో బాధపడుతున్న అడమ ఆదివారం పురుగుల మందు తాగింది. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆగి ఉన్న బైక్‌ను ఢీకొట్టిన ఆటో

పెనుబల్లి: మండలంలోని సీతారామపురం పెట్రోల్ బంక్ వద్ద జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న బైక్‌ను ఆటో ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న ఇద్దరు యువకులే కాక ఆటోలో వెళ్తున్న మహిళ, డ్రైవర్‌కు గాయాలయ్యాయి. మండలంలోని తాళ్లపెంటకు చెందిన ఎస్ఐఎస్ఎఫ్ జవాన్ కొత్తపల్లి రవి, సగ్గుర్తి గోపాలకృష్ణ వీఎం బంజర్ వైపు వెళ్తూ మార్గమధ్యలోని సీతారామపురం బంక్ వద్ద ఆగారు. అదే సమయాన తల్లాడ మండలం రామానుజవరానికి చెందిన ఆటోడ్రైవర్ పిల్లి నవీన్ కల్లూరు వైపు నుండి వీఎంబంజర్ వైపు వస్తూ వీరి బైక్‌ని ఢీకొట్టాడు. దీంతో ఆటో పల్టీ కొట్టగా రవికి, గోపాలకృష్ణతో పాటు ఆటోడ్రైవర్ నవీన్, ఆటోలోని ఓ మహిళకు తీవ్ర గాయాలు అయ్యాయి. వీరికి పెనుబల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. కాగా, ప్రమాదం జరిగిన సమయాన అదే మార్గంలో వెళ్తున్న సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి తన వాహనాన్ని ఆపి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించడంలో సహకరించారు. అనంతరం ఘటనపై ఆరా తీసిన కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

లారీ ఢీకొని మహిళ మృతి, కుమారుడికి గాయాలు

ఖమ్మంరూరల్: మండలంలోని కోదాడ క్రాస్ వద్ద ఆటోను లారీ ఢీకొట్టిన ఘటనలో పొన్నేకల్‌కు చెందిన కొట్టె లక్ష్మి(45) మృతి చెందింది. ఈ ప్రమాదంలో ఆమె కుమారుడు రాజేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పొన్నేకల్ చెందిన ఆటోడ్రైవర్ రాజేష్ తన తల్లి లక్ష్మికి ఖమ్మంలోని ఆస్పత్రిలో చికిత్స చేయించి ఆటోలో సోమవారం రాత్రి ఇంటికి తీసుకెళ్తున్నాడు. ఈక్రమంలో కోదాడ క్రాస్ వద్ద ఎదురుగా వచ్చిన లారీ ఆటోను బలంగా ఢీకొట్టింది. ఈఘటనలో లక్ష్మికి తీవ్రగాయాలై అక్కడిక్కడే మృతి చెందగా, ఆమె కుమారుడు ఆటో నడుపుతున్న రాజేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


లారీ కింద దాసు మృతదేహం

సత్తుపల్లిరూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన సత్తుపల్లి మండలం బుగ్గపాడులో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బుగ్గపాడుకు చెందిన కల్లూరు దాసు(40) కూలీ పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఆయన రహదారి వెంట వెళ్తుండగా చంద్రాయపాలెం నుంచి సత్తుపల్లి వైపు వెదురు బొంగుల లోడ్‌తో వస్తున్న లారీ వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో దాసు అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉండగా, కుటుంబీకుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్మీ జవాన్ మృతి

గీసుకొండ: వరంగల్ జిల్లా గీసుకొండ మండలం ఊకల్ హవేలీ – సంగెం రహదారిలో మూలమలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ఆర్మీ జవాన్ మృతి చెందాడు. జమ్మూకాశ్మీర్‌లో ఆర్మీజవాన్‌గా విధులు నిర్వర్తిస్తున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం బాపనికుంటకు చెందిన చల్ల శ్రీనివాస్(32) తన భార్య భవానితో కలిసి ఆదివారం సంగెం మండలం చింతలపెల్లిలోని బంధువుల ఇంటికి బైక్‌పై వచ్చాడు. తిరుగు ప్రయాణంలో సాయంత్రం ఊకల్‌హవేలి శివారు మూలమలుపు వద్ద వాహనం అదుపు తప్పి, ఫెన్సింగ్ కోసం పాతిన రాయికి ఢీకొట్టాడు. ఈ ఘటనలో దంపతులిద్దరికీ గాయాలయ్యాయి. 108లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శ్రీనివాస్ మృతి చెందాడు. మృతుడి సోదరుడు సోమవారం ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ బాబూలాల్ తెలిపారు.

వివాహిత మృతిపై కేసు నమోదు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం అల్లీపురానికి చెందిన వివాహిత మంగమ్మ(54) మృతిపై ఖానాపురం హవేలీ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. ఆమె గత 20ఏళ్లుగా ఒక వ్యక్తితో సహజీవనం సాగిస్తోంది. అయితే, అంతకుముందే మంగమ్మకు కుమారులు ఉండగా, వారు తల్లి వద్దకు రాకపోకలు సాగించే క్రమాన సహజీవనం చేస్తున్న వ్యక్తి వ్యతిరేకించినట్లు సమాచారం. ఈక్రమంలోనే మంగమ్మ గాయాలతో ఖమ్మం ఆస్పత్రిలో ఉన్నట్లు తెలియగా మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించి చికిత్స చేయిస్తుండగా ఆదివారం రాత్రి మృతి చెందింది. ఈ మేరకు తమ తల్లిపై అనుమానాలు ఉన్నాయని కుమారులు చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.